1993
నుండి
వెలువడుతున్నది

నెగ్గిక : ముత్యాపి
(విజయ : చైత్రము)

ఏప్రిల్ 2013

తెలుగుజాతి పత్రిక

# నడుస్తున్న చరిత్ర

• నుడి • నాడు • నెనరు

15 రూ.



మయన్మార్‌లో తెలుగు - తెలంగాణ

సి. ధర్మారావు కనుమరుగు

వారసత్వ సంపద : ప్రమాదంలో 'వినుకొండ'

## ఏప్రిల్ 18 : ప్రపంచ వారసత్వ దినోత్సవం

ఒక తరం నుంచి మరోతరానికి అందించేదీ అంది పుచ్చుకొనేదీ కూడా వారసత్వమే. 1972వ సం. నుండీ ప్రపంచ వ్యాప్తంగా గత కాలపు వైభవ ప్రాభవాలను - అది కట్టడమైనా, శిల్పమైనా, భాషయినా, పాటయినా, మాటలయినా, కట్టు అయినా బొట్టయినా తిండి అయినా తిప్పలైనా - ఏదైనా వారసత్వ కోవలోకి వచ్చేదే. ఆధునికానంతర విపరీత పోకడలతో మనకున్న జ్ఞానసంపదనంతా మనకు తెలియకుండానే ఒలక పోసుకుంటున్నాం. కనీసం కట్టడాలు, శిల్పాలు, శాసనాలు, చారిత్రక స్థలాలను కాపాడుకొని తర్వాతి తరాలకు అందించడం బాధ్యతగా ప్రతి విశ్వమానవుడూ గుర్తించాలని - 1972వ సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి ఒక తీర్మానం చేసింది. సభ్య దేశాలన్నీ ఒక్కటై ఆహ్వానించిన ఆ తీర్మానం చాలా దేశాల్లో చట్టంగా రూపుదిద్దుకొని కట్టుదిట్టంగా అమలవుతున్నది. ఆ మాటకొస్తే కమ్యూనిస్టు దేశమంటూ మిగతా ప్రపంచం విమర్శిస్తున్నా, వారసత్వ పరిరక్షణలో చైనా మిగతా అగ్రరాజ్యాల కంటె ఏడడుగులు ముందున్నమాట నిజం.

మనదేశం విషయానికొస్తే కేంద్ర పురావస్తు సంస్థ ఆ బాధ్యతను నెత్తినపెట్టుకొన్నా మిగతా దేశాలకంటే వారసత్వ పరిరక్షణలో ఏడడుగులు వెనుక ఉన్నామనే చెప్పాలి.

ఇక మనరాష్ట్రంలో అయితే 1914 నుంచీ అంటే గత నూరేళ్లుగా పురావస్తుశాఖ తన ఉనికిని చాటుకోగా కోస్తాతీరంలో మద్రాసు ప్రెసిడెన్సీ పాలకులైన బ్రిటీష్‌వారు కూడా అనేక చారిత్రక కట్టడాలనూ స్థలాలను గుర్తించి పరిరక్షించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వారసత్వాన్ని మరింతగా పరిరక్షించుకొంటామని చంకలెగరేసుకున్న మన ప్రభుత్వాల డొల్లతనం ఏ పురావస్తువు ను చూసినా చిన్నపిల్లవాడికి కూడా అర్థమవుతుంది. కౌరవ సంతతిగా దాదాపు 600కు పైగా రక్షిత కట్టడాల చరిత్రను అట్టహాసంగా ప్రకటించిన రాష్ట్ర పురావస్తుశాఖ నూటికి నూరుశాతం నిబంధనలకు నీళ్లొదిలింది. సిబ్బందిలో నిబద్ధత కరువు, నిధుల లేమి - వెరసి - వెక్కరింత ప్రహసనంగా మారింది. ఇక - కేంద్ర పురావస్తు శాఖ తమ ఆధ్వర్యంలో వున్న 65 రక్షిత స్థలాలు, కట్టడాలు యాజమాన్య పద్ధతుల్లో రాష్ట్ర ప్రభుత్వం కంటె మిగులుగానే ఉన్నా స్థానికులకు అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయిందనే చెప్పాలి.

అందుకనే తెలుగు భాషోద్యమ సమాఖ్య ఈ బాధ్యతను కూడా నెత్తినపెట్టుకొని ప్రజల్లో ఈ అవగాహనను కలిగిస్తూనే ఉంది. ఇకనైనా ప్రతి స్థలమూ కట్టడమూ ముందువారి అడుగుజాడగా, గత చరిత్రను గురిజాడగా కలిసి కాపాడు కోవలసిన సమయం ఆసన్నమయిందని, అందుకు మరొక మహోద్యమం నడవాల్సిన అవసరం ఉందని మనవి చేస్తున్నాం.

-నడుస్తున్న చరిత్ర


తెలుగుజాతి పత్రిక

# నడుస్తున్నచరిత్ర

మాసపత్రిక

• నుడి • నాడు • నెనరు

భాషాసంస్కృతులనూ అనంత విజ్ఞానాన్నీ పెంపొందించుకొంటూ
సమసమాజ నిర్మాణదిశగా ఉద్యమ చైతన్యంతో
ముందుకుసాగే తెలుగుజాతి వేదిక.

సంపాదకుడు డా॥ సామల రమేష్‌బాబు


### •చందా వివరాలు•

| | | వ్యక్తులకు | సంస్థలకు |
|---|---|---|---|
| 3 సం॥ (36 సంచికలు) | : | రూ.400 | రూ.650 |
| 1 సం॥ (12 సంచికలు) | : | రూ.150 | రూ.250 |

ఎం.ఓ. లేదా విజయవాడలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని 'నడుస్తున్న చరిత్ర' పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.
ఆంధ్రా బ్యాంక్, మాచవరం, విజయవాడ ఆన్‌లైన్ అకౌంట్
**037111100000131**

### చందాదారులకు సూచనలు

మీ చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.

మీ చందా పూర్తయితే దయచేసి వెంటనే చందా పంపించండి. ఎం.ఒ.గాని డ్రాఫ్టుగాని పంపండి.


**చందాలు, రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా**

**నడుస్తున్న చరిత్ర**

జి-2, శ్రీవాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ-520 004
దూరవాణి:*0866*-2439466 సంపాదకుడు*: 9848016136*


**చందాదారులుగా చేరండి. ప్రతినెలా పత్రికను పోస్టులో పొందండి**

**Subscription Rates for foreign countries :**
Per annum : U.S. $ 20 For 5 years : U.S. $ 100
Payable to *Nadustunna charithra* at vijayawada


Address for correspondence :
Nadustunna Charithra, G.2, Sri Vayuputra Residency,
Hindi College Street, Machavaram, Vijayawada - 520004.
Phone : 0866-2439466(Office) 9848016136(Editor)
e-mail: ncharithra@gmail.com


www.kinige.com

సంపాదకీయం

# పొంచివున్న పెనుముప్పు

ఈనెల మొదటివారంలో యు.పి.ఎస్.సి. అధికారుల ద్రోహాన్ని పసిగట్టి వారి కొత్త విధానాన్ని జనంలో, చట్టసభల్లో, కోర్టుల్లో నిలదీసిన విద్యార్థులను, ఉపాధ్యాయులనూ భాషోద్యమకారులనూ రాజకీయనేతలనూ మెచ్చుకొని తీరాలి. అయితే, కొత్త విధానంపై తిరగబడిన ఈ వర్గాల ప్రయోజనాల్లో, చూపుల్లో తేడా ఉంటుంది. తక్షణం ఎదురైన ప్రమాదం నుంచి బయటపడడం విద్యార్థులకూ, వారికి శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులకూ అవసరమయింది. రాజకీయ నాయకులాశించే ప్రయోజనం అందరకూ తెలిసిందే. ప్రజాభిమానాన్ని కోల్పోకుండా చూసుకోవడమే వారి తక్షణావసరం. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షాల్లో ఉన్నా మన రాజకీయులంతా పాలకవర్గంగానే ఉంటారు. యు.పి.ఎస్.సి.లో ఇంతటి పెనుమార్పులు వస్తుంటే వారు తెలుసుకోలేకపోయారా? ప్రకటన వచ్చిన తర్వాత - విద్యార్థులు, ఉద్యమకారులు వీధికెక్కేదాకా, కోర్టులకెక్కేదాకా అదేమీ తమకు పట్టనట్లు ఎందుకు ఊరకున్నట్లు? ఇలాంటి మన పాలకవర్గాల చేతిలో ప్రభుత్వ విధానాలను రూపొందించే హక్కులన్నీ ఉన్నాయి. ఇంకా మన కోర్టుల్లో విశ్వసనీయత బలంగా ఉండబట్టి, ప్రజల్లో ఉద్యమచైతన్యం ప్రబలమవుతుండబట్టి బ్రతికిపోతున్నాం. ఈ పరిస్థితికి తాజా ఉదాహరణ ఈ యు.పి.ఎస్.సి. ఉదంతం.

యు.పి.ఎస్.సి. నడిపే పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉద్యోగాల్లో కుదురుకొనే వారిని స్వాభిమానం లేనివారుగా, విదేశీ విధానాల దాసులుగా, వెన్నుపూస జారిపోయినవారిగా తీర్చిదిద్దే ఈ ప్రయత్నాన్ని విజయవంతంగా ఇప్పటికైతే ఎదుర్కోవడం జరిగిందిగాని, అవసరమైన సవరణలు తెచ్చి అయినా, భారత రాజ్యాంగాన్ని మరింత పటిష్టం చేసుకోకపోతే భారతీయ భాషలను నిర్వీర్యం చేసేందుకు మన పాలకవర్గాలు ముమ్మందు ఎంతకైనా బరితెగించవచ్చు. అంతర్జాతీయ వత్తిళ్లకు మన దేశ నేతలు, అధికారులు దాసోహం అనవచ్చు.

ఇప్పటి యు.పి.ఎస్.సి. వ్యవహారంలో మన రాష్ట్రానికి సంబంధించి ముందుగా మేల్కొన్నది విద్యార్థులే. సివిల్స్ పరీక్షలకు సిద్ధం కావడానికి శిక్షణ నిస్తున్న అధ్యాపకుల మార్గదర్శకత్వం వారికి సహజంగానే ఉంది. తెలుగు భాషోద్యమ సమాఖ్య నుండి వారికి పూర్తి మద్దతు లభించింది. మార్చి 11నే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ఉపాధ్యాయ, విద్యార్థి వర్గాల మద్దతుతో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సమాఖ్య దాఖలు చేసింది. వేగంగా సాగుతున్న ఉద్యమానికి పత్రికా ప్రసారమాధ్యమాలు పూర్తి సహకారాన్ని, సమర్థనను అందించాయి. ఆ తర్వాత నాలుగు రోజులకు తెలుగుదేశం పార్టీ కూడా మరొక 'పిల్' దాఖలు చేయడంతో రాజకీయ వేడి కూడా వచ్చిపడింది. తొలినుండీ వామపక్ష విద్యార్థి సంఘాలు, యువజనులే ఉద్యమ నిర్వహణలో ఉన్నారు. 18న ప్రధాన న్యాయమూర్తి ముందుకు వ్యాజ్యం విచారణకు రాగానే న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలతోనే పరిస్థితి స్పష్టమయింది. దానికితోడు పార్లమెంటులో అన్నిపక్షాల సభ్యులూ విరుచుకుపడ్డారు. యుపిఎస్‌సి తోకముడిచి, ప్రతిపాదించిన అన్ని మార్పులీ వెనక్కు తీసుకుంది. ఎదురైన ప్రతిఘటన ఇంత తీవ్రంగా ఉంటుందని వారనుకొని ఉండరు. ప్రపంచీకరణ పుణ్యమా అని గత రెండు దశాబ్దాలుగా ఇంగ్లీషును బలిష్టం చేస్తూ, భారతీయ భాషల్ని వీలైనంతగా బలిచేస్తున్న విధానాల ఫలితంగా ఇప్పటికే జనం గొంతులు పెగలకుండాపోయి వుంటాయని ఆ 'సంస్కర్తలు' తప్పు అంచనా వేసుకొన్నారు!

ఈ సందర్భంగా మనం కొంచెం లోతుగా ఆలోచించవలసిన సంగతులే ఉన్నాయి. ప్రపంచీకరణ పేర ప్రభుత్వ మద్దతుతో వీస్తున్న పడమటి గాలులకు అన్ని భారతీయ భాషలూ ఎదుగుదలను కోల్పోతున్నాయి. తక్కినవారితో పోల్చుకుంటే అన్నివిధాలుగా మన పరిస్థితి భయంకరంగా ఉంది.

తెలుగు భాషాజాతిగా మన ఎదుగుదలకు ఎదురవుతున్న సవాళ్లను తట్టుకొని, పునరుజ్జీవనం పొందాలని మనం ప్రయత్నాలు చేస్తున్న సమయంలో వచ్చిన ఈ యు.పి.ఎస్.సి. ఉదంతం - మనకు చాలా చిన్న సమస్య. మన ప్రభుత్వాల పట్టనితనం కారణంగా తెలుగు ప్రజల్లో తమ భాషవల్ల ఉపయోగం ఏమీ లేదనే నిరాశానిస్పృహలు నెలకొనివున్న పరిస్థితుల్లో - తెలుగు నేలపై ఇప్పుడిప్పుడే పుంజుకొంటున్న భాషోద్యమం ఈ సమస్యను ఎదుర్కొంది. ప్రజల భాషను నిర్లక్ష్యంచేస్తున్న ప్రభుత్వాన్ని ఉద్యమాల ద్వారా దారికి తెచ్చుకొంటూ, అన్ని రాజకీయ పార్టీల్లో

ఆలోచనలు రేకెత్తిస్తున్న దశలో - తెలుగువారికి ఆత్మగౌరవ సమస్యగా ఏది ఎదురైనా ప్రజల్లో తీవ్ర స్పందన వస్తుంది. తెలుగుకు ప్రాచీన భాషాప్రతిపత్తి నివ్వక అవమానించిన సందర్భంలో ఇలాంటి స్పందనే వచ్చింది. అప్పుడు రాజకీయపార్టీలన్నీ చెవులు రిక్కించి జనఘోషను విని, పెదవి విప్పక తప్పలేదు. ఇలాంటి సంఘటనలు, సందర్భాలు తెలుగు భాషోద్యమం సాగిస్తున్న పోరాటానికి బలాన్నిస్తాయి.

ఇటీవలి ప్రపంచ మహాసభల సందర్భంగా భాషోద్యమకారులు సాధించదలచుకొన్నది తెలుగుకోసం పాలనా వ్యవస్థల, విధానాల ఏర్పాటు. కాని, అంతటితో లక్ష్యం పూర్తి కాదు. తెలుగు జాతి భాషాపరంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాల్సిన అవసరం ఉంది. నేడు పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో, అన్ని స్థాయిల్లో ప్రయోజనకరమైన భాషగా తెలుగును మనం ఎదిగించుకోలేకపోతే, మన భాష మరుగుజ్జుగా, ప్రయోజనరహితంగా మిగిలిపోతుంది. చిన్నచూపుకు గురై ఆధిపత్య భాషలకు బానిసవుతుంది. అది ఇప్పుడు ఇంగ్లీషు కావచ్చు, రేపు చైనా భాషో మరొకటో కావచ్చు. ఆ ముప్పు ఏర్పడకుండా ఉండాలంటే పోటాపోటీగా మనం మన భాషను అన్నివిధాలుగా ఎదిగించుకోవలసిందే. అలాంటి చేవ ఉన్న భాషల్లో మన భాష ఏమాత్రం వెనుకబడిలేదు. జన సంఖ్య దృష్ట్యా కూడా మనం ప్రపంచంలోనే తొలి పది స్థానాల్లో ఉన్నాం. (తెలుగుకు మూలాల్లోంచి చూచి సరిగా లెక్కలు వేస్తే).

భారతీయ ప్రజా భాషలను రక్షించుకోవడానికి అవసరమైన రాజ్యాంగ సవరణలు తెచ్చుకోవాలని పైన ప్రస్తావించాం. 8వ షెడ్యూల్‌లో ఉన్న 22 భాషలనూ జాతీయ భాషలుగా ప్రకటించాలనే నిక్కచ్చును చాలాకాలంగా కొన్ని రాజకీయ పక్షాలు ముందుకు తెస్తున్నాయి - ముఖ్యంగా తమిళ పార్టీలు. ఈ విషయాన్ని వారికంటె ముఖ్యంగా భుజాన వేసుకోవలసిన వాళ్లం మనం. జనసంఖ్య దృష్ట్యా, భౌగోళిక వ్యాప్తిదృష్ట్యా ఇది మనకు అవసరం. మన 18 కోట్ల తెలుగు వారిలో ఈ రాష్ట్రంలో ఉన్నది సగంమందేనన్న నిజం అందరకూ తెలిసిందే. తక్కిన వారంతా ఇతర రాష్ట్రాల్లో ఉండి, స్వంత భాషకు దూరమవుతున్నారు. ప్రాథమిక విద్యను మాతృభాషలో నేర్చుకొనేందుకు వివిధ రాష్ట్రాల్లోని భాషాల్ప సంఖ్యాకులకు రాజ్యాంగంలో ఒక 'వీలు' ఉన్నా, దాన్ని విజయవంతంగా త్రోసిపుచ్చగల శక్తిని భాషాప్రయుక్త రాష్ట్రాలు కొన్ని ఇప్పటికే ప్రదర్శిస్తున్నాయి. అంతేకాకుండా - కంప్యూటర్ల వినియోగం అత్యంత అధునాతనంగా రోజురోజుకూ అందుబాటులోకి వస్తున్న ఈ రోజుల్లో మన భాషలన్నిటినీ ఆధునికం చేసుకోగల అవకాశం ఉంది. రాజ్యాంగంలో భాషల విషయంలో ఉన్న కొన్ని అస్పష్టతలు, అసమంజస ఏర్పాట్లు ఆంగ్లానికీ, హిందీకి పెద్దపీట వేస్తున్నాయి కూడా. ఈ అన్ని లొసుగులను తరచిచూచి, 60 ఏళ్ల అనుభవంపై ఆధారపడి, భారతీయ భాషల పరిరక్షణకు తగిన చర్యల్ని మనం చేపట్టకపోతే పొంచివున్న ముప్పును మనం పట్టించుకోకపోవడమే అవుతుంది. యునెస్కో హెచ్చరించిన ప్రమాదాన్ని ఆహ్వానించడమే అవుతుంది.

ఇప్పుడు ఎదురైన యు.పి.ఎస్.సి. ఉదంతం మనల్ని వెక్కిరిస్తోంది. అసలు విద్యారంగంలో మీ తెలుగు(భారతీయ భాషల) స్థాయి ఏమిటి అని ప్రశ్నిస్తోంది. కళాశాల స్థాయిలో తెలుగెక్కడ ఉంది? డిగ్రీలో తెలుగు చదివిన వారే లేనప్పుడు మీకెందుకీ తెలుగు, హాయిగా ఇంగ్లీష్‌లో పరీక్షలు వ్రాసుకోక! అని ఎగతాళి చేస్తోంది. పాఠశాలను వదిలి, కళాశాలలోకి అడుగుపెట్టాక తెలుగు ఊసేలేనివారికి - ఇంజనీరింగ్, మెడిసిన్ వంటివి చదివి సివిల్స్ వ్రాసేవారికి తెలుగు గొడవెందుకు? ఇప్పటిదాకా చదివింది ఇంగ్లీషులోనే కదా? తెలుగు సాహిత్యం పేరుతో మీకెందుకీ అవకాశం అని నిలదీస్తోంది. తెలుగురాని తెలుగువాడా, తెలుగులో పరిపాలించుకోవడం చేతగాని తెలుగువాడా... నీకెందుకయ్యా, సివిల్స్‌లో తెలుగు గొడవ?! అని అడుగుతోంది.

విద్యారంగంలో, పాలనలో తెలుగుపట్ల ఇంతవరకూ స్పష్టమైన విధానం లేనందువల్ల ఏర్పడిన దుష్పరిణామం ఇది. అసలు భాషా విధానం అంటూ ఉండాల్సిన అవసరమేముంది అని ప్రశ్నించే నేతలూ మనకున్నారు!

చిన్న అంశాన్ని తీసుకొని మేమేదో పీకిపాకాన పెడుతున్నామనుకోకండి. సివిల్స్ ఉదంతాన్ని ఇంత లోతుగా ఆలోచించి, ముమ్ముందు రాగల పెనుముప్పు నెదుర్కోవడానికి సమూలంగా తగిన చర్యలు తీసుకోవాలనేదే మా విన్నపం. భాషోద్యమాన్ని శక్తిమంతం చేసుకొంటూ మన వ్యవస్థల్ని, పాలనారీతుల్ని చక్కదిద్దుకోవాలి. మొత్తం తెలుగుజాతి కోసం మనమంతా పనిచేయాలి.

**30-03-2013**

సామల రమేష్‌బాబు

**ఏ రాష్ట్రంలో ఉన్నా ఏ దేశంలో ఉన్నా తెలుగువారంతా ఒక్కటే**

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1662**

* * *

**Read other issues of Nadustunna Charitra @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Nadustunna+Charitra+Magazine&id=60**